REGD. NO. A. 40 | విడి ప్రతి 0-20 న. పై | శుక్రవారం 23-9-60

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 32 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 39

## అధిష్ఠానవర్గం ఆదేశంతో పి. వి. జి. రాజు ప్రకటన

మంత్రివర్గ విభేదాల విషయంలో తాను గతాన్ని విస్మరించి, రాజీకి సిద్ధముగా ప్రభుత్వంలో అవినీతి వున్నదని తాను అంతకుముందుచేసిన ప్రకటన యదార్థం గాదని ఆరోగ్యమంత్రి శ్రీ పి. వి. జి. రాజు చేసిన మరొక ప్రకటన, రాజకీయవర్గాలలో వూహాగానాలకుదారి తీసింది. రాజువైఖరిలో మార్పువచ్చిందని, వారు యూనిటీ ఫ్రంటునువదలి సత్యనారాయణరాజుగారితో చేతులు గలుపవచ్చునని, దానికి యీ ప్రకటనే సూచనని పెక్కుమంది అభిప్రాయపడ్డారు. కాని దీని విషయం విచారించగా, రాజుగారి మొదటి ప్రకటనను కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంవారు తీవ్రంగా ఆక్షేపించి, దాన్ని ఖండిస్తూ, సామరస్య ధోరణిలో మరొక ప్రకటన చేయుమని సలహా యిచ్చారని, యీ ప్రకటన దాని పర్యవసానంగా యిచ్చిందేగాని రాజుగారి మునుపటి వైఖరిలో మార్పులేదని విశ్వసనీయంగా తెలుస్తున్నది.

# రాజీ జరగాలంటే—

# పరిస్థితి మరీ విషమించిపోకుండా చూడాలె!

## హైకమాండు గట్టిఆదేశమిచ్చి అదుపులో పెట్టాలె-గోపాలరెడ్డి

## బలాబలాలు తేల్చుకోనివ్వడమే ఉత్తమ పరిష్కారమార్గం -ఏ. సి.

—o—

### సుబ్బారెడ్డిగారిని మంత్రిగాతీసుకొని వివాదానికి స్వస్తిజెప్పాలె —వంగల్లు కోదండరామరెడ్డి

"ఆంధ్ర కాంగ్రెస్‌లోని ఉభయ వర్గాలమధ్య సామరస్యం సాధింపబడాలంటె, అధ్వాన్నమైన నేటిపరిస్థితి, మరింత విషమించకుండా చూడడం అవసరం. దీనికి కాంగ్రెస్ అధిష్ఠానవర్గం ఔదాసీన్యంవహించకుండా గట్టి ఆదేశమివ్వవలెను." అని కేంద్ర పౌర వ్యయశాఖామాత్యులు డాక్టరు బెజవాడ గోపాలరెడ్డిగారు 22 తేది నెల్లూరులో మా విలేఖరితో మాట్లాడుతూ వుద్ఘాటించారు.

ఉభయ వర్గాలమధ్య గౌరవ ప్రదమైన రాజీకి కొంతకాలం క్రితం తానొక ప్రతిపాదనచేసి వున్నానని, కాని దానినిగూర్చి తీవ్రంగా ఎవ్వరితోనూ చర్చించలేదని, నేటిపరిస్థితిలో తన ప్రతిపాదన కాలదోషం పట్టిందా అనిపిస్తున్నదని, ఏమైనా 1962 ఎన్నికల దృష్ట్యా యీవిభేదాలు కొనసాగగూడదని గూడా శ్రీ గోపాలరెడ్డిగారన్నారు.

కావలి-కనుపూరు కాల్వలను తృతీయ ప్రణాళికలో చేర్పించుటకు ఢిల్లీకి రాయబారం పోయివచ్చిన శాసనసభ్యుడు శ్రీ వంగల్లు కోదండరామిరెడ్డి, శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారిని మంత్రివర్గం నుండి తొలగించడంతో యీ విభేదాలు ప్రారంభమై నేడు సంక్లిష్టమైనవి కాబట్టి, ప్రతిష్ఠకు పెనుగులాడకుండా వారిని తిరుగా మంత్రివర్గంలోకి తీసుకొని సామరస్యం నెలకొల్పడం ఒక్కటే నేడు కనబడుతున్న పరిష్కారమార్గమని, తాను యీసూచనను మంత్రి వర్గీయులకు చేశానని చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారికి యిలాంటి సూచనే మరొకరు గూడా చేసినట్లు తెలుస్తున్నది.

రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా శ్రీ నరోత్తమరెడ్డిగారిని కొనసాగించే విషయంలో రాజీప్రసక్తి లేదని, వారుగాకుండా మరెవరినైనా అధ్యక్షులుగా నిర్ణయించే విషయంలో, సామరస్య సంభాషణలకు తాము సుముఖులమని, యీ వివాదం యిట్లనే కొనసాగడం మంచిది కాదని, బలాబలాలు తేల్చుకొనుటకు హైకమాండు అనుమతిస్తే రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత త్వరలో నెలకొంటుందని, యిదొక్కటె యీ సమయంలో వుత్తమ పరిష్కార మార్గమని శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు వెలిబుచ్చారు.

మద్రాసు, బొంబాయి కేరళ, కాంగ్రెస్ వాదులమధ్య తగాదాలు లేని రాష్ట్రంలేదని, రాష్ట్ర కాంగ్రెసు – మంత్రివర్గము, లేదా, మంత్రివర్గము–శాసనసభ పార్టీలమధ్య సహజంగా వివాదాలొస్తుంటాయని, ఏ రాష్ట్రంలో చూచినా మంత్రివర్గంమాత్రం సమైక్యంగా వుంటుందని, ఆంధ్రలో మంత్రివర్గమే రెండుగా చీలిపోయిందని, యిది విపరీత [illegible] స్థితి అని, మంత్రివర్గ సమిష్టిబాధ్యతా నిర్వహణకు యిది తీరని ప్రతిబంధకమని, ముఖ్యంగా బడ్జెట్ సమయంలో యీ చీలికలతో మంత్రివర్గం పనిచేయుడం కష్టమని శ్రీ గోపాలరెడ్డిగారు చెలిబుచ్చారు.

హైకమాండుకు ఇలాంటివి చిన్నవిషయాలని, వారు ఇది చెయ్యండి, ఇది చెయ్యవద్దు (Dos and Donts) అని కఠినంగా ఆదేశించని ఫలితంగా కాంగ్రెస్ విభేదాలు విస్తృతంగా పెరిగిపోతున్నాయని, సలహాగాకుండా గట్టి ఆదేశమివ్వనిదే యిది పరిష్కారం గాదని శ్రీ గోపాలరెడ్డిగారన్నారు. ఆంధ్ర వివాదం సామరస్యంగా పరిష్కారం గావాలంటే, యిప్పటికే అధ్వాన్నమైన పరిస్థితి, మరింత విషమించకుండా చూడడం అవసరమని, రాజీ అనేది ఏదో ఒక వర్గమో తాము అనుకున్నది సాధించుకున్న తర్వాత, లేక ఒక వర్గం అవమానానికి గురియైన తర్వాత సాధ్యం గాదని, ఆ పరిస్థితులు కలుగకముందే దానికి కృషిచేయాలని శ్రీ గోపాలరెడ్డిగారన్నారు. యథాతథంగా (status quo) వుండటం రాజీ కాదని, యిరువురికీ గౌరవప్రదంగా, సమ్మతకరంగా వుండేట్లు పరిష్కరించాలని వారన్నారు. కొంతకాలం క్రితం తానొక ప్రతిపాదన చేశానని, యిరువర్గాలమధ్య సంబంధం మరింత చెడిపోయిన యీ సమయంలో తన ప్రతిపాదనకు కాలదోషం పట్టిందేమో

—కొరవ 7.వ పేజీలో

గ్రామ్సు : నిర్మల | ఫోను : 280

అష్టమి పండుగకు

సిద్ధముగ నున్నవి

★ ★ ★ ★

నిర్మల వక్కపొడి చిన్నపొట్లాలు :

1 పొట్లం : 0—02 న. పై.

50 పొట్లముల పేకెట్టు : 0—81 న. పై.

నిర్మల వక్కపొడి కేవలం మొత్తముగా గాకుండా అంటుకు అందుబాటులో వుండులాగున అనేకమంది అభిమానులు కోరినందున యీ పద్ధతి అములులో పెట్టినాము.

వారి సలహాకు మా ధన్యవాదములు

నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు — నెల్లూరు

# శ్రీ సంజీవయ్య నాయకత్వం— కొనసాగడమా? తొలగింపబడడమా?

## యూనిటీఫ్రంటు దీనిని తేల్చుకుంటేనే రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత

### హైదరాబాదులేఖ

మా విలేఖరి

పత్రికల్లో తరువాత పేర్కొనబడిన ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు తగాదాలకు పరిష్కారం ఇప్పట్లో కనబడడంలేదు. ఇంకా రెండు మాసాలవరకు ఇటూ అటూ తేలకపోవచ్చును.

పార్లమెంటరీ బోర్డు, దాని తరఫున త్రియుకులు కామరాజనాడార్, యు.ఎన్. ధేబర్ ఇచ్చిన రెండు సలహాలను అధికార వర్గం (ఇక్కడు దీన్ని సంజీవయ్య వర్గమని పిలువవచ్చు) త్రోసిరాజన్నారు. నరోత్తమ రెడ్డిగారి రాజీనామాకు కాని, ఆయనపట్ల విశ్వాసతీర్మాన ప్రతిపాదనకు కాని, ముఖ్యమంత్రి సంజీవయ్య అన్నివర్గాలకు అతీతంగా వ్యవహరించడానికి కాని ఈ వర్గం వారు సమ్మతించలేదు. సమ్మతించే ఉద్దేశ్యంకూడా వారికి కలగడంలేదు. కాబట్టి తరువాత చర్య తీసుకోవలసినవారు మళ్లీ కాంగ్రెసు కార్యవర్గము, పార్లమెంటరీ బోర్డువారున్నూ. ఈ రెండు సంఘాల సమావేశం వచ్చే మాసం తొలిరోజుల్లోతల సాధ్యంకాదని కనబడుతున్నది. ప్రధాని నెహ్రూ, మొరార్జీదేశాయి, కాంగ్రెసు అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డిగార్లకు వచ్చే నెల అంతా ముందుగానే నిర్ణయమైపోయిన కార్యక్రమాలు వున్నాయి.

ఈ మధ్యలో అధికారవర్గం నాయకులు కొత్త బలాన్ని చేకూర్చుకోవడానికి పూనుకున్నారు. రోజులకొలది అల్లూరి సత్యనారాయణరాజు ప్రభృతులు చేస్తున్న ప్రకటనల ధోరణి, ఇస్తున్న ఉపన్యాసాల సరళి, కాంగ్రెసు వాదులెవరికీ గౌరవప్రదంగా లేవు. అయితే వీటి ప్రభావం కాంగ్రెసు కార్యకర్తలమీద తీవ్రంగా పడుతున్నది. కాంగ్రెసు కార్యకర్తల వత్తిడికి తట్టుకోలేకపోతారేమో. బ్రహ్మానందరెడ్డి ప్రభృతులంకూడా అల్లూరిపై తగుచర్యకై పట్టుబడుతున్నామని, ప్రకటనలు చేస్తున్నారు. అల్లూరిపై కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీలో అభిశంసన తీర్మానం ప్రతిపాదించాలని వీరి ఉద్దేశం. ఇందుకోసం పార్టీ సమావేశానికి రిక్విజిషన్ ఇచ్చి, అందులో ఇలాంటి తీర్మానం గెలవడమే జరిగితే సంజీవయ్య మంత్రివర్గం పోవడం తథ్యం. సంజీవయ్యగారిని అల్లూరి "దుష్టచతుష్టయం" నుంచి తప్పించగలమనే ఆశ యూనిటీఫ్రంటు వారికింకా వున్నట్లయితే అది అడియాసే అవుతుంది. నిజానికి ముఖ్యమంత్రి అల్లూరిపై అభిశంసన తీర్మానం తనపై అవిశ్వాస తీర్మానంగానే భావిస్తానని బహిరంగంగా ప్రకటించారు. కాంగ్రెసు అధ్యక్షుని దుయ్యబట్టుతున్నందుకే అల్లూరిపై చర్య తీసుకోదలచాముకాని, మంత్రివర్గంలోకాని, పరిపాలనలో కాని జరుగుతున్న కార్యకలాపాల మార్పు లేక విధానాల మార్పు కాదు అని ఫ్రంట్ వారు తెలుపుతున్నారు. ఇలాంటి తీర్మానం ముఖ్యమంత్రి తనపైనే అవిశ్వాస ప్రకటనగా భావించడమెందుకని ఫ్రంట్ నాయకులు ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తున్నారు.

—తరువాత 12 వ పేజీలో

## బొంబాయి గవర్నరు రాజీనామా?

కమాండరు నానావతి శిక్ష అమలుకు సంబంధించి తన వుత్తరువుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు యిచ్చిన ఫలితంగా బొంబాయి గవర్నరు శ్రీ శ్రీప్రకాశ తన పదవికి రాజీనామాయిచ్చారని, దానిని ఆమోదించమని రెండవసారి ఒత్తిడిగూడా చేశారని ఒక బొంబాయి వారపత్రిక ప్రకటిస్తున్నది. శ్రీ శ్రీప్రకాశ హిమాలయాల తీర్థయాత్రలో కేదారనాద్‌లో వుండగా సుప్రీంకోర్టు తీర్పు తెలిసిందని, వెంటనే వైర్‌లెస్‌ద్వారా తన రాజీనామా వుద్దేశ్యాన్ని రాష్ట్రపతికి తెల్పారని ఆ పత్రిక వర్తమానం. కాని రాష్ట్రపతి, ప్రధాని కూడా శ్రీ ప్రకాశను తొందరపడవద్దని సలహా యిచ్చారట.

★

### నానావతి అప్పీలు

తనకు బొంబాయి హైకోర్టు విధించిన శిక్షమీద నానావతి తరఫున దాఖలు చేయబడిన అప్పీలు దరఖాస్తును సుప్రీంకోర్టు ఆమోదించింది

# ముడిమైకాకంటే తయారైన మైకా ఎగుమతి లాభదాయకం

★

## త్వరలో గూడూరులో తానొక కర్మాగారం నెలకొల్పనున్నట్లు శ్రీ గోగినేని వెంకటేశ్వరరావు ప్రకటన

ఇంగ్లండు, అమెరికా, పశ్చిమజర్మనీ, ఇటలీ, స్విట్జర్లాండు దేశములలో ఐదు వారాలపాటు పర్యటించి, 15 తేదీ గూడూరు చేరిన 'షా' అధిపతి శ్రీ గోగినేని వెంకటేశ్వరరావుగారు పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, ముడిమైకాను ఎగుమతి చేయడంకంటే తయారైనమైకా (మాన్యుఫ్యాక్చర్డ్ మైకా)ను ఎగుమతిచేయడం లాభదాయకమని; అందువల్ల దానికితగిన కర్మాగారములను మనదేశములోనే నెలకొల్పుట అవసరమని; ప్రభుత్వం దీనికి తగినంత ప్రోత్సాహమివ్వవలెనని చెప్పారు.



న్యూయార్కులోని సుప్రసిద్ధమైన "ఆష్‌విల్లి మైకాకంపెనీ" సహాయంతో తాను త్వరలో ఒక కర్మాగారాన్ని నెలకొల్పుతున్నామనికూడా శ్రీ వెంకటేశ్వరరావుగారు వెల్లడించారు.

కమ్యూనిస్టుదేశాలైన తూర్పు దేశాలలో మన మైకాకు మంచిధర, డిమాండుకూడా వున్నవని శ్రీ వెంకటేశ్వరరావుగారు నుడివారు.


పశ్చిమ దేశాలలో యజమాని – కార్మికుని మధ్య సౌహార్ద్రపూరితమైన సత్సంబంధం నెలకొనివున్నదని, మనదేశంలోవలె పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బంది అవసరంలేదని, కార్మికులు తమ ధర్మమును చిత్తశుద్ధితో నిర్వర్తిస్తారని, తామంతా ఒక కుటుంబంగా భావిస్తారని శ్రీ వెంకటేశ్వరరావుగారన్నారు.

కొందరు మైకా ఎగుమతిదార్లు పంపిన శాంపిల్స్‌కు భిన్నంగా సరుకు పంపినందువల్ల నమ్మకం పోయిందని, కాని కొందరిమీద నమ్మకం లేకపోలేదని, అచ్చట పరిశీలించుకొనేపద్ధతివల్ల చిన్న ఎగుమతిదార్లకు చాల కష్టనష్టము లున్నమాట వాస్తవమనీ, ఆర్డర్ పద్ధతిమీద విదేశీవ్యాపారులు కొనడం పురికింగా వుంటుందని వారు తెలియచేశారు.

క్షేమంగాపోయి లాభంగా తిరిగివచ్చిన తమ యజమాని శ్రీ వెంకటేశ్వరరావు గౌరవార్థం కృష్ణా మైనింగుకంపెనీ, దాని అనుబంధసంస్థ ఉద్యోగబృందం, గ్రామీణవర్గం కలసి 15 తేదీ గొప్ప సన్మానసభ ఏర్పాటు చేశారు. శ్రీ తిమ్మగుంట సురేంద్రనాథ్ అధ్యక్షత వహించారు. తన ఉద్యోగుల క్షేమమే తన క్షేమంగా భావిస్తానని శ్రీ వెంకటేశ్వరరావుగారు సన్మానానికి జవాబు చెప్పారు. 'షా' మేనేజరు శ్రీ కె. పాచ్. ప్రసాదరావు వందనసమర్పణం చేశారు.

—మా గూ. వి.

దసరాముస్తాబుకోసం దయచేసిరాండి



రాయవరపు శంకరయ్యా అండ్ సన్సు
CLOTH MERCHANTS
ట్రంకురోడ్డు టెలిఫోన్ : 188 నెల్లూరు
RATES ARE FIXED

